# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్‌ను స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.
- ❖ స్వర్ణ గ్రామం పేరుతో ఐఏఎస్ అధికారులు పల్లె నిద్ర చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.
- ❖ మంగళగిరిలో 100 పడకల ఆసుపత్రికి త్వరలో శంకుస్థాపన చేస్తామని మంత్రి నారా లోకేష్ తెలిపారు.
- ❖ ముస్లింల సంక్షేమం కోసమే వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.
- ❖ బుడమేరులో మరమ్మతుల పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.

=====================

ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్‌ను ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ నుంచి విడదీసి స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో ఈ రోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలకు ఆమోదం తెలిపారు. ఆ వివరాలను రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి పాత్రికేయులకు వివరించారు. అనకాపల్లి జిల్లాలోని డీఎల్‌పురం వద్ద క్యాపిటివ్ పోర్టు ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి పార్ధసారధి వెల్లడిస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

=====================

స్వర్ణ గ్రామం పేరుతో ఐఏఎస్ అధికారులు పల్లె నిద్ర చేయాలని ముఖ్యమంత్రి నారా  చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఉన్నతాధికారులు 3 రోజులు, 2 రాత్రులు పల్లెనిద్ర చేయాలని సూచించారు. అమరావతిలో ఈ రోజు జరిగిన మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులతో పలు అంశాలపై ముఖ్యమంత్రి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కర్మయోగి శిక్షణా కార్యక్రమాల గురించి చర్చించారు. శాఖలకు స్వయం ప్రతిపత్తి కల్పించే దిశగా ఆప్కాస్ ను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆప్కాస్ పై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసే ఆలోచన ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంత్రులను ఆయన కోరారు. అలాగే, ప్రతి మంత్రిత్వ శాఖలో కేంద్ర పథకాలను అధ్యయనం చేసి రాష్ట్రానికి నిధులు వచ్చేలా ప్రయత్నం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

=====================

మంగళగిరిలో 100 పడకల ఆసుపత్రికి త్వరలో శంకుస్థాపన చేస్తామని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో “మన ఇల్లు.. మన లోకేష్..” కార్యక్రమాన్ని ఈ రోజు ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ.. తొలిదశలో 3 వేల మందికి మంగళగిరిలోనే ఇళ్ల పట్టాలు అందిస్తున్నామన్నారు. స్వచ్ఛ మంగళగిరి పేరిట నిర్వహించే కార్యక్రమం ద్వారా మంగళగిరిని దేశంలో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొంటూ…

(వాయిస్ 34 సెకన్లు)

=====================

ముస్లింల సంక్షేమం కోసమే వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. రాజ్యసభలో వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును ఈ రోజు ఆయన ప్రవేశపెట్టారు. లోక్‌సభలో నిన్న 12 గంటల సుదీర్ఘ చర్చ అనంతరం ఈ బిల్లు ఆమోదం పొందింది. ఈ సందర్భంగా బిల్లుపై ఆయన మాట్లాడుతూ… వక్ఫ్ ఆస్తులను ముస్లిమేతరులు నిర్వహిస్తారనే ప్రచారంలో నిజం లేదని స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డుకు భూములు ఎక్కువగా కలిగి ఉన్నప్పటికీ ముస్లిం సమాజంలో పేదరికం పోలేదని సచార్ కమిటీ నివేదిక పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

=====================

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని బుడమేరులో మూడు గండ్లు మరమ్మతుల పనులను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. మంత్రివర్గం ఆమోదించిన 39.05 కోట్ల రూపాయల నిధులతో త్వరలోనే టెండర్లు పిలవాలని కోరారు. అమరావతి సచివాలయంలో బుడమేరు ఆధునీకరణపై నీటి పారుదల శాఖ  అధికారులతో మంత్రి ఈ రోజు  సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… బుడమేరు డైవర్షన్ కెనాల్ ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా పెండింగ్ పనులు పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళికను  సిద్ధం చేయాలని ఆదేశించారు. అదే విధంగా బుడమేరు పాత ఛానెల్ కు సమాంతరంగా కొత్త ఛానెల్ ను కూడా 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని మంత్రి కోరారు.

విరామం

=====================

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారికి కోటి రూపాయలు విరాళం ఇచ్చే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ప్రకటించింది. తిరుమలలో ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజులలో మినహా మిగిలిన రోజుల్లో విరాళం ఇచ్చిన భక్తులు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవచ్చునని టిటిడి అధికారులు తెలిపారు. కోటి రూపాయలు విరాళం ఇచ్చే దాతలకు వారితో పాటు నలుగురికి ప్రతి సంవత్సరం 3 రోజులు

సుప్రభాత సేవ, 3 రోజులు బ్రేక్ దర్శనం చేసుకోవచ్చునని తెలిపారు. దాతలు టిటిడి వెబ్ సైట్ అయిన ttddevasthanams.ap.gov.in లో ఆన్ లైన్ ద్వారా విరాళాలు చెల్లించవచ్చునని తెలిపారు.

=====================

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఎపిఎస్పిడిసిఎల్ ఇన్‌ఛార్జ్ నాగేశ్వరరావు తెలిపారు. శ్రీకాళహస్తిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... గత రెండు నెలల వ్యవధిలో పీఎం సూర్య ఘర్ పథకం కోసం 17,386 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ధరఖాస్తు చేసుకున్న వినియోగదారులందరికీ రాయితీ కింద సోలార్ విద్యుత్ కనెక్షన్లను అందించామని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

=====================

పశ్చిమ గోదావరి జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా అధికంగా పని దినాల కల్పనకు కార్యాచరణను రూపొందించామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మొగల్తూరు మండలం వారతిప్ప మురుగు కాలువలో ఉపాధి హామీ కార్మికుల ద్వారా జరుగుచున్న కిక్కిస తొలగింపు పనులను ఆమె ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జాబ్ కార్డ్ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి పని కల్పిస్తామన్నారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా పని ప్రదేశాలలో తాగునీరు, మజ్జిగ వంటివి అందించేందుకు ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

=====================

మాంసం, గుడ్లు, పాడి ఉత్పత్తి ద్వారా జిల్లాలో అభివృద్ధి సూచీలను పెంచడానికి తగు ప్రణాళికలు రూపొందించాలని విజయనగరం జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సూచించారు. జిల్లా అభివృద్ధిలో కీలకమైన వ్యవసాయ అనుబంధ రంగమైన పశు సంపదను పెంపొందించవలసిన అవసరం ఉందని తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పశు సంవర్ధక శాఖ అధికారులతో కలెక్టర్ ఈ రోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మండల మహిళా సమాఖ్య ద్వారా ప్రతి మండలంలో ఒక గుడ్లు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని డి.ఆర్.డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కి సూచించారు.

=====================

కోనసీమను కోకో హబ్ గా తీర్చిదిద్దాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఉద్యానవన అధికారులను ఆదేశించారు. కొబ్బరి తోటలలో అంతర పంటగా కోకో సాగుకు ఎంతో అనువైన వాతావరణం ఉందని ఆయన అన్నారు. జిల్లాలో కోకో సాగు విస్తీర్ణాన్ని దశల వారీగా పెంచాలని సూచించారు. అమలాపురం కలెక్టరేట్ లో జిల్లా స్థాయి కోకో కమిటీ ఆధ్వర్యంలో ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, కమిటీ సభ్యులతో ఈ రోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొబ్బరి రైతులను ఆదుకునేందుకు కోకో పంటని అంతర పంటగా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.

=====================

ఉత్తర కోస్తా దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశా పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాగల మూడు రోజులలో ఉత్తర కోస్తా జిల్లాలలో పలు చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. అదే విధంగా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలలో ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

======================

======================